సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వేం నరేందర్‌రెడ్డికి నాగోల్ సమస్యలు వివరిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల సురేందర్‌రెడ్డి

కొత్తపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగోల్‌లో నెలకొన్న స్థలాల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల సురేందర్‌రెడ్డి శనివారం సచివాలయంలో సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన వేంనరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌నూ సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మొగుల్ల రాజిరెడ్డి, మలిపెద్ది అంబరీష్‌రెడ్డి, కిష్టారెడ్డి రెడ్డి పేట వెంకటేష్, మందడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికిరణ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రవికిరణ్ పొణుగుపాటి

వనస్థలిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్(హెచ్‌ఆర్‌పీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌కు చెందిన రవికిరణ్ పొణుగుపాటి నియమితులయ్యారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆర్.వి. లక్ష్మీ శనివారం రవికిరణ్ పొణుగుపాటికి నియామకపత్రం అందజేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని అణగారిన వర్గాలు, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల హక్కుల సాధనకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సంస్థ చైర్ పర్సన్ ఆర్.వి. లక్ష్మీకి రవికిరణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, కృష్ణ, నానీ, అఖిల్, సుమన్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరెడ్డికి సన్మానం



వ్యవసాయం, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని శనివారం బీఆర్‌కే భవన్‌లోని కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బాలరాజు, కార్యదర్శులు కోట్ల శ్రీనివాస్, మామిడి కృష్ణకుమార్, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పృథ్వీరాజ్, నేతలు బాలపోచయ్య, శ్రీనివాస్

- సైదాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి)

ఆలయ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



వెంకటేశ్వరస్వామి ఆలయంలో జయశ్రీరాజు, సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా కొండ్ర ఎల్లమయ్య, డైరెక్టర్లుగా శ్రీకాంత్‌రెడ్డి, లావణ్యగౌడ్, కృష్ణ, దేవేందర్‌గౌడ్ చేత దేవాదాయ శాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గీతావేణుగోపాల్ రెడ్డి, అనుపమా సుప్రసేనారెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్‌ముదిరాజ్, హరిశంకర్‌ముదిరాజ్, విద్యా విజయేందర్‌రెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

బీఎస్‌పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడిగా సంపత్



నియామకపత్రం అందుకుంటున్న వేముగంటి సంపత్

మన్సూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వేముగంటి సంపత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాటపాక రమేష్ ఆధ్వర్యంలో శనివారం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్వాటి రాములు చేతుల మీదుగా సంపత్ నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో బండారి రవికుమార్, జిల్లపల్లి శశిధర్, మంత్రి జగన్, గువ్వల సాయి రామకృష్ణ, మేకల లక్ష్మణ్, జక్క యాదగిరి, దాసరి వినయ్, కొమ్ము పవన్, నల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం




రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

సరూర్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 15వ డివిజన్‌లోని పద్మావతికాలనీ, సీతా ఎవెన్యూ కాలనీల్లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరీ జైహింద్‌కుమార్, బండారి మనోహర్, నాయకులు అఫ్జల్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్థుల అభ్యున్నతికి కృషి

ఎల్‌బీనగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా గౌడ కులస్థుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకత్‌గౌడ్ అన్నారు. లింగోజిగూడలోని సరూర్‌నగర్ గౌడ సంక్షేమ సంఘం భవనంలో శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర గీత పనివార సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాటి చెట్లను పెంచే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. అనంతరం బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత పనివారల సంఘం ఉపాధ్యక్షుడు పండ్ల రాములుగౌడ్, రాష్ట్ర సెంటర్ కోఆర్డినేటింగ్ సెక్రటరీ నాగభూషణంగౌడ్, కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘాల జేఏసీ అధ్యక్షుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సరూర్‌నగర్ గౌడ సంక్షేమ సంఘం నేత దయానంద్‌స్వామి గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్‌గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో చోరీకి యత్నం



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సరూర్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ యువకుడు చోరీకి యత్నించాడు. ఆలయంలోని హుండీ పగులగొట్టడానికి ప్రయత్నించగా అది తెరుచుకోలేదు. ఆలయంలో అలికిడి విన్న స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా మీర్‌పేట్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈలోగా స్థానికులు ఆలయంలో చోరీకి యత్నించిన దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చోరీకి యత్నించిన యువకుడు ఆలయంలోని ఉప ఆలయం శిఖరాన్ని ధ్వంసం చేశాడని, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి యత్నించిన యువకుడిని లెనిన్ నగర్‌కు చెందిన జె.కుమార్(25)గా గుర్తించినట్టు మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. హుండీ తెరుచుకోలేదని, ఆలయం గోపురం ధ్వంసం కాలేదని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఫ్లూ, చికున్‌గున్యాతో జాగ్రత్త!

- యాంటీబయాటిక్స్‌కు దూరంగా ఉండండి
- వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- మాస్క్‌తో వ్యాప్తి నివారణ
- ప్రముఖ వైద్యుడు డాక్టర్ ప్రీతమ్‌రెడ్డి





దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వైరల్ జ్వరాలు, చికున్‌గున్యా, ఫ్లూ లక్షణాలు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ సారి వైరల్ జ్వరాలు, ఫ్లూ, చికున్ గున్యా పంజా విసురుతుండడంతో ప్రతి పది ఇళ్లలో ఒకరిద్దరు జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరల్ జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, వైద్య నిపుణుల సలహాలు, సూచనలు పాటించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ప్రీతమ్‌రెడ్డి సూచిస్తున్నారు.

ఫ్లూ వైరల్ లక్షణాలు..

జలుబు, గొంతునొప్పి, దగ్గు, ఒళ్లనొప్పులు(బాడి పెయిన్స్), జ్వరం తదితర లక్షణాలతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ లక్షణాల్లో కొన్ని ఉన్నప్పటికీ దాన్ని ఇన్ ఫ్లూ ఎంజా వైరస్ ఉపరకంగా భావించి, సత్వరమే తగిన వైద్య సహాయం తీసుకోవాలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో న్యూమోనియాకు దారి తీసే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రోగనిర్ధారణ కోసం..

వైరస్ నిర్ధారణ కోసం నాసోఫారింజియల్ పరీక్ష, రాపిడ్ యాంటిజెన్ లేదా ఆర్‌టీ పీసీఆర్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

చికున్ గున్యా లక్షణాలు

దోమ కాటువల్ల వైరల్ ఫీవర్ వచ్చి చికున్ గున్యాకు దారితీస్తుంది. తీవ్ర జ్వరం, కీళ్ల నొప్పులు, వాపులు, శరీరంపై దురదలు, తలనొప్పి ఉంటుంది. కీళ్ల నొప్పులు రెండు వారాల నుంచి నెల రోజుల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ లక్షణాలున్న వారు వెంటనే చికున్‌గున్యా యాంటి బాండీస్ పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది.

మళ్లీ మాస్క్ ధరించాలి

కోవిడ్ సమయంలో ప్రతి ఒక్కరూ మాస్క్ ఎలా ధరించారో.. ప్రస్తుతం ఉన్న ఫ్లూ నేపథ్యంలో కూడ ప్రతి ఒక్కరూ అలాగే భౌతిక దూరాన్ని పాటిస్తూ మాస్క్ ధరిస్తూ శానిటైజర్‌ను ఉపయోగించడం శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తున్నారు. నోటి బిందువుల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొకరికి త్వరగా ఈ ఫ్లూ వ్యాప్తి చెందుతుందని హెచ్చరిస్తున్నారు.



డాక్టర్ ప్రీతమ్‌రెడ్డి

వైరస్‌కు తగిన చికిత్స

వైరల్ ఫీవర్, చికున్‌గున్యా, ఫ్లూ లక్షణాలున్న వారు యాంటి బయాటిక్స్ మందులు వాడడం మంచిది కాదని డాక్టర్ ప్రీతమ్‌రెడ్డి చెబుతున్నారు. వైద్యులను సంప్రదించి, వైరస్‌కు తగిన చికిత్సలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా 65 సంవత్సరాల వయస్సు పైబడిన వారు, డయాబెటిక్, గుండె సంబంధిత వ్యాధులున్న వ్యక్తులు, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు, కేన్సర్ రోగులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వ్యక్తుల్లో ఫ్లూ న్యూమోనియాకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి, వైరస్ నివారణకు మందులు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

కోర్టులో ఆరోగ్యంపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. మనిషి దైనందిన జీవితంలో శరీర ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈసదస్సులో పీహెచ్‌కే గ్రూప్ చైర్మన్ పెనుమర్తి హరికృష్ణ వివరించారు. హరికృష్ణ తన జీవితంలో ఎదురైన అనారోగ్య సమస్యలను సులభంగా అధిగమించడానికి దేశంలోని ప్రముఖ వైద్య, ఆరోగ్య నిపుణుల సలహాలు, సమస్యలను అధిగమించిన తీరును వివరించారు.

నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం



సమావేశంలో సూచనలిస్తున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

సైదాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే లాడ్జీలు, హోటళ్లను సీజ్ చేస్తామని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ హెచ్చరించారు. శనివారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సౌత్ ఈస్ట్‌జోన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్ల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర భద్రతా చట్టం, ట్రేడ్ లైసెన్స్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ చట్ట పరిధిలో లాడ్జీలు పని చేయాలని ఆదేశించారు. లాడ్జీలో ఉంటున్న ఐడీ రుజువు రికార్డును సులభంగా పరిశీలించడానికి ఆవరణలో అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ ఎంట్రీలను స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలని స్పష్టం చేశారు. పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం బ్యాకప్‌తో సీసీటీవీ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. హోటళ్లు, లాడ్జీలలో నిర్వహించే వాణిజ్య కార్యక్రమాల వివరాలు ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. గేమింగ్, వ్యభిచారం, డ్రగ్స్ చెలామణి వంటి చట్టవిరుద్ధమైన చర్యలు జరిగితే నిర్వాహకులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. భద్రతా పరికరాలు, సెక్యూరిటీ గార్డులు పటిష్ఠంగా ఉండేటా చూసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ టి.స్వామి, సైదాబాద్, మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట ఏసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, మహ్మద్ గౌస్, మనోజ్ కుమార్, జోన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

9.4 నిమిషాల్లో చేరుకునేలా చర్యలు : సీపీ



సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏదైనా ప్రమాదం ఎదురైనా ఆపదలో ఉన్నా వెంటనే డయల్ 100కు ఫోన్ చేస్తే బాధితులు ఎక్కడ ఉన్నా 9.4 నిమిషాల్లో పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఖ్యను పెంచామన్నారు. గతంలో డయల్ 100కు ఫోన్ చేసిన వారిని చేరుకునేందుకు సుమారు 20 నిమిషాలు పట్టేదని, ఇప్పుడు పోలీస్ రెస్పాన్స్ సమయాన్ని సగానికంటే తక్కువగా చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. విజుబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందులో భాగంగా కొత్తగా పెట్రో కార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఖ్యను పెంచామని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో విజుబుల్ పోలీసింగ్‌ను పెంచడంలో భాగంగా పోలీసులు సైకిళ్లపై కూడా గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచడం ద్వారా బందోబస్తు, నిఘాతోపాటు విజుబుల్ పోలీసింగ్ పెరుగుతుందన్నారు. మహిళలకు సహాయకారిగా ఉండేందుకు పెట్రోలింగ్ బృందాల్లో మహిళా పోలీసులు కూడా ఉంటారని తెలిపారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో చేపడుతున్న ఓపెన్ జిమ్, విజయపురి కాలనీ ఫేజ్1-లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో చలో ఖమ్మం రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం



చలో ఖమ్మం కరపత్రాన్ని విడుదల చేస్తున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, గోపీనాయక్

ఎల్‌బీనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 5,6 తేదీల్లో చేపట్టే చలో ఖమ్మం.. రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు మూడావత్ ధర్మానాయక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపీనాయక్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ బంజారబస్తీలో రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల సారథి, గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మానాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నవంబర్ 5,6 తేదీల్లో ఖమ్మంలో రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన సమ్మేళనంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో లోకే సోమ్లానాయక్, ఈశ్వర్ నాయక్, పవన్‌నాయక్, సాయి నాయక్, సింధుప్రియ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఆలయ మాజీ ధర్మకర్త



కేటీఆర్‌ను కలిసిన హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్త సతీష్‌గౌడ్

చంపాపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా కర్మన్‌ఘాట్ డివిజన్‌లోని హనుమాన్ దేవస్థానం ఆలయ మాజీ ధర్మకర్త బీసుకుంట్ల సతీష్ గౌడ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

పద్మశాలీ దసరా మేళాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పున్న గణేష్ నేత

మన్సూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ ఆటోనగర్‌లోని హరిణి వనస్థలి(డీర్‌పార్క్) ఆవరణలో ఆదివారం నిర్వహించే పద్మశాలీ దసరా మేళాను విజయవంతం చేయాలని ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పిలుపునిచ్చారు. శనివారం హరిణి వనస్థలి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పద్మశాలీ దసరా మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈమేళాకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ హాజరవుతారన్నారు. అనంతరం మేళాకు సంబంధించిన ఏర్పాట్లను పద్మశాలీ దసరా మేళా కమిటీ చైర్మన్ కౌకుంట్ల రవితేజ, సభ్యులతో కలిసి పున్న గణేష్ నేత పరిశీలించారు. ఈ మేళాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎల్‌బీనగర్‌కు వ్యవసాయ మార్కెట్ ఇంజనీరింగ్ విభాగం కార్యాలయాల తరలింపు



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ నుంచి తరలిస్తున్న డీఈ, ఈఈ కార్యాలయాలు

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతున్న హైదాబాద్, రంగారెడ్డి ఈఈ, డీఈ కార్యాలయాలను ఎల్‌బీనగర్‌లోని ఎన్‌టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో ఉన్న మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలోకి మార్చారు. శనివారం సంబంధిత సిబ్బంది కార్యాలయానికి సంబంధించిన వస్తువులు ఇతర సామగ్రిని తరలించారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగిన ఇంజనీరింగ్ విభాగం కార్యాలయాలు మార్కెట్‌లో నెలకొన్న స్థల ప్రభావంవల్ల ఖాళీ చేయాల్సి వచ్చింది. మార్కెట్ కార్యాలయాల నిర్వహణకు స్థలం సరిపోని కారణంగా జేడీ కార్యాలయంలోకి మార్చాల్సి వచ్చిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం



పసుమాములలో షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తట్టిఖానా, పసుమాముల గ్రామాల్లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను శనివారం మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తట్టిఖానా సర్వే నంబర్ 26లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను, పసుమాములలోని సర్వే నంబర్ 422లో వెలసిన షెడ్డును తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది ఎక్స్‌కవేటర్ సహాయంతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆర్ఐ నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బీరప్పస్వామి కల్యాణం

సరూర్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 21న కనులపండువగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు పెద్దకురుమ గౌర సత్యనారాయణ కురుమ, సెలుపోజి దొడ్డి మల్లికార్జున్ కురుమ, కార్పొరేటర్ గౌర రమాదేవి శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టకప్పే కార్యక్రమం, ఆదివారం ఓడక లగ్నం, కొట్నం, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. సోమవారం బీరప్ప కామరాతిదేవి కల్యాణోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. 22వ తేదీనఎల్లమ్మదేవి ఒగ్గుకథ, 23న బీరప్ప స్వామి ఒగ్గుకథ ఉంటాయని, 24వ తేదీ షైలలు తీసే కార్యక్రమంతో ఉత్సవాలను ముగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.